## క్లుప్తంగా

### అన్నదానానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న దాతలు

యలమంచిలి: అడవిపాలెం గ్రామంలోని పంచముఖ ఆంజనేయస్వామి అన్నదానం కార్యక్రమానికి సోమవారం ఇద్దరు దాతలు ఒక్కొక్కరూ రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. గుడాల వెంకట సత్యనారాయణమూర్తి కుటుంబ సభ్యులు రూ.లక్ష, బందారులంక గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు వీరవల్లి రమేష్ రూ.లక్ష అందజేశారు. ఈ విరాళాన్ని మంత్రి నిమ్మల రామానాయుడు చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు మంత్రితోపాటు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

### మహిళలపై దాడులను అరికట్టాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ

నరసాపురం: మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ అన్నారు. బీజీబీఎస్ మహిళా కళాశాలలో సోమవారం స్త్రీ హింసా వ్యతిరేక దినం సందర్భంగా నిర్వహించిన సదుస్సులో ఆమె మాట్లాడారు. పసి పిల్లలపై కూడా లైంగికదాడులు జరుగుతున్నాయన్నారు. దీనిని అరికట్టాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇటీవల తిరుపతి, విశాఖ నగరాల్లో మైనర్ బాలికపై జరిగిన అత్యాచారాలు చూస్తుంటే తల్లితండ్రులు హడలిపోతున్నారన్నారు. విద్యార్థులు కలిసికట్టుగా సమస్య పరిష్కారానికి ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ కె.అమ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

### మార్టేరు-పాలకొల్లు రోడ్డులో రాకపోకల పునరుద్ధరణ



మార్టేరు రోడ్డులో రాకపోకలను పునరుద్ధరించిన దృశ్యం

పెనుమంట్ర: మార్టేరు-పాలకొల్లు ఆర్అండ్‌బీ మార్గంలో రహదారి నిర్మాణ నిమిత్తం గత నెల 20 నుంచి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. అయితే మార్టేరు సెంటర్ నుంచి కనక దుర్గ గుడి వరకు 700 మీటర్ల సీసీ రోడ్డు పనులు పూర్తి కావడంతో సోమవారం రాత్రి నుంచి ఈ రోడ్డుపై రాకపోకలను పునరుద్ధరించినట్లు పెనుమంట్ర ఇన్‌చార్జి జేఈ యశ్వంత్ తెలిపారు.

### తీపి గుర్తుగా వనసమారాధన



వనసమారాధనలో పాల్గొన్న కాపు నేతలు

మొగల్తూరు: కార్తీక మాసంలోనే కాకుండా తరుచుగా మనమంతా కలుసుకోవడం తీపి గుర్తులుగా ఉంటాయని పలువురు నాయకులు పేర్కొన్నారు. సోమవారం మొగల్తూరులోని కోట ప్రాంతంలోని కాపు సామాజిక వర్గం వన సమారాధనను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాపు నాయకులు కోటిపల్లి సురేష్, కావలి నాని, కోటిపల్లి ఆనందరావు, తన్నీడి గిరి, గురుజు శ్రీనివాస్, కొత్తపల్లి బాబి, పులపర్తి నానాజి, తదితరులు పాల్గొన్నారు.

### విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పెనుగొండ: భగవాన్ శ్రీసత్య సాయి 99వ జన్మదినం సందర్భంగా బాల వికాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతు అందజేశారు. సత్య సాయిబాబా మందిరంలో జిల్లా ప్రథమ స్థానం పొందిన భావ్యంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి మండా హరిత ప్రియకు బీవీ రమణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, కానిస్టేబుల్ బీవీ రమణ చేతుల మీదుగా బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ ఎన్‌వీ అప్పారావు, చాంప్స్ ఇన్‌చార్జి రాజీరోజాజీ పాల్గొన్నారు.

# అంబులెన్సులకు మరమ్మతులేవీ ?

- మూలన పడుతున్న 108 వాహనాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- లబోదిబోమంటున్న బాధితులు



నెల రోజులుగా మూలన పడి ఉన్న 108 అంబులెన్సు

పాలకొల్లు సెంట్రల్: రహదారుల్లో ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే వారిని రక్షించడానికి సాధారణంగా ఎవరూ ముందుకు రాకపోవడంతో ఒక్కో సమయంలో వారి ప్రాణాలు సైతం గాల్లో కలిసిపోయేవి. ఈ పరిస్థితిని గ్రహించి నాడు మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం 108 అంబులెన్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. నాటి నుంచి ఏ ప్రభుత్వం వచ్చినా 108 అంబులెన్స్ సేవలకు అధిక ప్రాధాన్యతను ఇచ్చేవి. నేడు ఈ అంబులెన్స్‌లు ఒక్క సారి కూత ఆగిందో ఇంక మూలకు చేరవలసిందే. రెండు మండలాలకు ఒక అంబులెన్సు ఉండేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లాలో దాదాపుగా మండలానికో అంబులెన్స్‌ను ఏర్పాటు చేసింది. ఆ మండలంలో గాని పట్టణంలో గాని ఏ ప్రమాదం జరిగినా మండల కేంద్రం నుంచి వాహనాలు బయలుదేరేవి. ప్రస్తుతం పాలకొల్లు నియోజకవర్గంలో యలమంచిలి మండలానికి చెందిన 108 అంబులెన్స్ ముందు అద్దం పగిలిపోయి మూలకు చేరి సుమారు నెల రోజులు కావస్తుంది. దీనిని పాలకొల్లు 108 కార్యాలయం వెనుక ఖాళీ స్థలంలో భద్రపరచడం విశేషం. ఇప్పటి వరకూ దీని మరమ్మతులకు అధికారులు చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. నియోజకవర్గంలో ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగితే అనుకున్న సమయానికి 108 వాహనం అందుబాటులోకి రావడం లేదని జనం వాపోతున్నారు. ఈ వాహనం మూలకు చేరిన తరువాత పాలకొల్లు పట్టణంలో ఉన్న వాహనాన్ని యలమంచిలిలో ఉపయోగిస్తున్నారు. ఇటీవల ఓ ప్రమాదం జరిగితే ఆ వ్యక్తిని 108లో తణుకు తీసుకువెళ్లవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇంతలో పూలపల్లి బైపాస్ వద్ద ప్రమాదం జరిగితే పాలకొల్లు, వీరవాసరానికి చెందిన వాహనాలు అందుబాటులో లేకపోవడంతో ఆ భాదితుడిని ప్రైవేట్ వాహనంలో ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. మరమ్మతులు చేయవలసిన వాహనాలను మూలన పడేయడం వల్ల ప్రమాదాల్లో అత్యవసరంగా ఉపయోగ పడాల్సిన 108 వాహనాలు అందుబాటులో లేకుండా పోయాయి. ప్రైవేట్ అంబులెన్సులు అధిక ధరలు తీసుకోవడంతో జనం గగ్గోలు పెడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి మూలన పడ్డ 108 వాహనాన్ని వెంటనే మరమ్మతులు చేయించి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై జిల్లా మేనేజర్‌ను వివరణ కోరడానికి ప్రయత్నించగా పోన్ అందుబాటులో లేకపోవడం గమనార్హం.

### మూలన పడేయడం దారుణం



108 వాహనాలు ప్రమాదంలో ఉన్న వారికి ఎంతో భరోసా కలిప్తున్నాయి. అటువంటి వాహనాలు మరమ్మతులు వస్తే నిర్లక్ష్యంగా మూలన పడేయడం చాలా దారుణం. ప్రాణాపాయ స్థితిలో ఉపయోగపడే వాహనాల పట్ల అధికారులు ఇంత నిర్లక్ష్య ధోరణితో ఉంటే ఎలా. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఈ వాహనాలు అందుబాటులో లేకపోవడం వల్ల క్షతగాత్రులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ వాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేలా వెంటనే చర్యలు చేపట్టాలి.

లోపింటి చిరంజీవి, పాలకొల్లు

### తల్లికి వందనమేది బాబూ..



కొవ్వూరి వేణుమాధవ రెడ్డి

పెనుగొండ: తల్లికి వందనం పథకం ఎప్పుడు అమలు చేస్తారని, విద్యలో పేదలకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తుందని రాష్ట్ర విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొవ్వూరి వేణుమాధవరెడ్డి విమర్శించారు. సోమవారం విలేకరులతోమాట్లాడుతూ ఎన్నికల ముందు తల్లికి వందనం పేరుతో ఎంత మంది పిల్లలు ఉన్నా ఏడాదికి ఒక్కొరికీ రూ.15 వేలు ఇస్తామని నమ్మబలికి నేటికీ అమలు చేయలేదన్నారు. త్రైమాసిక ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇప్పటి వరకూ చెల్లించకపోవడంతో పేదలు విద్యకు దూరం అవుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యా రంగాన్ని బలోపేతం చేసి, పేదలకు అందుబాటులోకి తీసుకొస్తే, ఇప్పటి కూటమి ప్రభుత్వం వారికి దూరం చేస్తుందని విమర్శించారు. వెంటనే విద్యార్థులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

### నేటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొల్లు సెంట్రల్: నరసాపురం డివిజన్ పరిధిలోని కొన్ని ప్రాంతాలకు నేటి నుంచి విద్యుత్ అంతరాయం కలిగే అవకాశం ఉందని నరసాపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.మధుకుమార్ తెలిపారు. సోమవారం పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ రామచంద్రాపురం, కొత్తపేట, ముమ్మిడివరం లైన్లలో పాడైన విద్యుత్ టవర్లను మార్పు చేయనున్నట్లు తెలిపారు. నరసాపురం డివిజన్‌లో ఈ నెల 26, 27, 28 తేదీల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఏడు గంటల వరకూ విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. నరసాపురం డివిజన్‌లో నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు, యలమంచిలి మండలాల్లో విద్యుత్ అంతరాయం కలిగే అవకాశం ఉందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్



పట్టుబడిన నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

పాలకొల్లు అర్బన్: భీమవరం డివిజన్ ఎక్సైజ్ పోలీసులు బెల్ట్ షాపుపై దాడి చేసి పోడూరు మండలం గుమ్మలూరుకు చెందిన జుత్తిగ పుష్కరరావును అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పాలకొల్లు ఎక్సైజ్ స్టేషన్‌లో పుష్కరరావుపై సోమవారం కేసు నమోదు చేశారు.ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్సై ఎల్.రమాదేవి, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# హరహర మహాదేవ శంభోశంకర

- శివయ్యకు కార్తీకమాస ప్రత్యేక పూజలు
- ఆలయాల్లో వెల్లివిరిసిన కార్తీక శోభ



నరసాపురం రూరల్: అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు



నరసాపురం: వలందర్‌రేవులో దీపాలు వదులుతున్న భక్తులు



పెనుగొండ: స్వామి వారికి అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు



మొగల్తూరు: చంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నరసాపురం రూరల్: కార్తీకమాసం ఆఖరి సోమవారం కావడంతో నరసాపురం మండలంలోని శివాలయాలు భక్తజన సందోహంతో పోటెత్తాయి. తెల్లవారు జాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు లక్ష్మణేశ్వరం రేవులోని వశిష్ఠ గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించారు. ఆలయ ప్రాంగణంలో ఆవునేతి ఒత్తులతో దీపాలు వెలిగించి అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలగంశెట్టివారి మెరక గ్రామస్తుల ఆర్థిక సాయంతో అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చాగంటి సురేష్‌నాయుడు, సిబ్బంది ఏర్పాట్లును పర్యవేక్షించారు.

**ప్రత్యేక పూజలు**

నరసాపురం: కార్తీకమాసం సోమవారం పట్టణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వశిష్టగోదావరి వలందర్‌రేవు భక్తులతో కిటకిటలాడింది. మహిళలు పెద్ద సంఖ్యలో రేవులో స్నానాలు చేసి గోదావరిలో దీపాలు వదిలారు. అనంతరం రేవులో పరమశివుడి విగ్రహానికి పూజలు చేశారు. కపిలమల్లేశ్వరస్వామి ఆలయం, గోదావరిగట్టున ఉన్న అమరేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి.

**ఆలయాలు భక్తులతో రద్దీ**

పెనుగొండ: కార్తీక సోమవారం ఆచంట నియోజకవర్గంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆచంటలో ప్రసిద్ధిగాంచిన ఆచంటేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారు జాం నుంచి భక్తులు బారులు తీరారు. ఆచంటేశ్వరునికి ఏకాదశ రుద్రాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సిద్ధాంతంలో కేదారీఘాట్ వశిష్ఠ గోదావరిలో భక్తులు కార్తీక దీపాలు వదిలారు. కేదారీఘాట్‌లో ప్రతిష్ఠించిన లింగానికి స్వయం అభిషేకాలు నిర్వహించారు. పెనుగొండలో శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలోనూ, అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతిధాంలో జ్యోతిర్లింగ శాలను సందర్శించి పూజలు నిర్వహించారు.

**శివనామస్మరణతో మారుమోగిన శివాలయాలు**

మొగల్తూరు: కార్తీకమాసం నాలుగో సోమవారం మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మొగల్తూరులోని పార్వతీ విశ్వేశ్వర స్వామి ఆలయం, వనమల్లిఖార్జున స్వామి ఆలయం, పేరుపాలెంలోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, కాళీపట్నంలోని భద్రకాళీ సమేత కాళికేశ్వరస్వామి ఆలయం, ముత్యాలపల్లిలోని భువనేశ్వరీ సమేత ముక్తేశ్వరస్వామి వారి ఆలయం, కొత్తపాలెంలోని ఆలయంలోనూ భక్తులు పూజలు నిర్వహించారు.

# ప్లాస్టిక్ వాడకంతో పెనుముప్పు



విద్యార్థులకు గుడ్డ సంచులను అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ పితాని నాగరాజు

యలమంచిలి: ప్లాస్టిక్ వాడకంతో మానవాళి మనుగడకు పెనుముప్పు పొంచి ఉందని పీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ పితాని నాగరాజు అన్నారు. ఈ విషయాన్ని బాల్య దశలోనే విద్యార్థులకు వివరించి, ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలన్నదే తమ ట్రస్ట్ ధ్యేయమన్నారు. కాజ పడమరలో సోమవారం ఆయన పాఠశాల విద్యార్థులకు గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను అతిగా వినియోగించడం వలన ఇప్పటికే రోగాల సంఖ్య పెరిగిందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని సమర్థంగా అరికట్టకపోతే రాబోయే తరాలకు భవిష్యత్తు ఉండన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కడలి భాస్కరరావు, పంజా నరసింహారావు, యర్రంశెట్టి అంజిబాబు, పాలంకి సుబ్బారావు, కొప్పినీడి వేణు తదితరులు పాల్గొన్నారు.

# అపార్ నమోదుకు ప్రత్యేక శిబిరాలు



విద్యార్థుల ఆధార్ కార్డులో పేర్లు నమోదు చేస్తున్న సచివాలయ సిబ్బంది

మొగల్తూరు: ఆధార్ కార్డు తరహాలో విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డు అందించాలని కేంద్ర ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా మండలంలోని నాలుగు ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో సీహెచ్ త్రిశూల పాణి సోమవారం తెలిపారు. 12 అంకెలతో కూడిన అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకౌంట్ రిజిస్ట్రీ)నెంబర్ కేటాయించడానికి నిర్ణయించారు. దీనిలో భాగంగా మొగల్తూరులోని ఉన్నత పాఠశాలలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థుల అధార్ కార్డులో మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం కల్పించారు. విద్యార్థులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారి సత్యనారాయణ

పెనుగొండ: అల్పపీడన ప్రభావంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని, దళారులను నమ్మి పోసపోవద్దని, పోడూరు మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ సూచించారు. సోమవారం పోడూరు మండలం కవిటంలో రైతుల కల్లాల్లో ధాన్యాన్ని పరిశీలించారు. మూడు రోజుల పాటు వరికోతలు వాయిదా వేసుకోవాలన్నారు. ఇప్పటికే వరి కోతలు పూర్తయితే కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని రైతులు రైతుసేవా కేంద్రాల ద్వారా మిల్లులకు త్వరగా పంపించాలన్నారు. లేదా సురక్షితమైన ప్రదేశంలో జాగ్రత్త పరచుకోవాలన్నారు. రైతుసేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలన్నారు.

**రైతులు దళారులను ఆశ్రయించవద్దు**

నరసాపురం: ధాన్యం అమ్మకాల విషయంలో రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని నరసాపురం ఆర్డీవో దాసి రాజు సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు రైతుసేవా కేంద్రాల ద్వారా మాత్రమే ధాన్యం అమ్మకాలు చేయలన్నారు. 48 గంటల్లో రైతుల ఖాతాల్లో ధాన్యం నగదు జమ చేస్తున్నామని చెప్పారు. ఎవరైనా రైతుల వద్ద నుంచి ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేసినట్టు నిర్ధారణ అయితే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### వైభవంగా అయ్యప్ప స్వాముల పేటతుళ్లై



సిద్ధాంతంలో పేటతుళ్లై నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు

పెనుగొండ: అయ్యప్ప మాలధారులు సోమవారం సిద్ధాంతంలో పేటతుళ్లై వేడుకను వైభవంగా నిర్వహించారు. గురుస్వామి కలగ భద్రుడు ఆధ్వర్యంలో పీఠంలో మాలధారులు మూల మహాగణపతికి, సుబ్రహ్మణ్యం స్వామికి, మాళిగాపు రత్తమ దేవికి, హరిహర పుత్రుడు అయ్యప్పస్వామికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు వేషాలతో అలరించారు. కార్యక్రమంలో మాలదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### నేడు లక్ష బిల్వపత్రి పూజ

నరసాపురం రూరల్: కార్తీకమాస ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని లక్ష్మణేశ్వరంలో వేంచేసియున్న శ్రీదుర్గాలక్ష్మణేశ్వరస్వామి వారి ఆలయంలో మంగళవారం లక్షబిల్వపత్రి పూజ నిర్వహించనున్నట్లు కార్య నిర్వాహణాధికారి చాగంటి సురేష్‌నాయుడు తెలిపారు. బ్రహ్మశ్రీ మంచిలి దుర్గాప్రసాద్ శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు యలమంచిలి దుర్గాప్రసాద శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

### యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

యలమంచిలి: గ్రామానికి చెందిన చివటపు రూపేంద్ర మణికంఠ హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 17న కార్తీక వనసమారాధన నిమిత్తం స్వగ్రామానికి వచ్చి, తిరిగి 18న హైదరాబాద్ రైలులో వెళ్లాడు. మరుసటి రోజు తండ్రి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. అప్పటి నుంచి అతని ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. బంధువులు, స్నేహితులను వాకబు చేసినా మణికంఠ ఆచూకీ లభించకపోవడంతో సోమవారం తండ్రి చివటపు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కర్ణీడి గుర్రయ్య తెలిపారు.

# 500 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వైద్య శిబిరంలో 500 మంది విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో కళ్లజోళ్లు అవసరమైన 25 మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లజోళ్లు అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.నవ్యజీవన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యంలో దృష్టి లోపం ఉంటే చదువుకి ఆటంకం కలుగుతుందన్నారు. దృష్టి లోపం గుర్తించి కళ్లజోడు వాడితే కొంత వరకు లోపాన్ని తగ్గించవచ్చన్నారు. దృష్టి లోపం రాకుండా విటమిన్ ఏ సంబంధిత ఆకుకూరలు, పాలు, గుడ్లు, క్యారెట్, బొప్పాయి వంటి ఆహారం ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఎంఈవో ఆర్ఎస్‌వీఎస్ గంగాధరశర్మ, ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఎం ఆర్‌కే రాజు, సునీల్‌కుమార్, ఇన్‌చార్జ్ హెచ్ఎం జనార్ధన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరి బాబు, పిహెచ్ఎన్ పి ఎలిజబెత్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# మోడీ విధానాలు సామాన్యులకు భారం



కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

పాలకొల్లు అర్బన్: బీజేపీ విధానాలకు రాష్ట్రంలోని పాలక వర్గాలు కొమ్ముకాస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు విమర్శించారు. సోమవారం స్థానిక సమతా భవన్‌లో సీపీఎం జనరల్ బాడీ సమావేశం మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో వాసుదేవరావు మాట్లాడారు. సామాన్యులపై భారం మోపి కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధంగా ప్రధాని నరేంద్ర మోడీ పాలన ఉందన్నారు. కార్యక్రమంలో చల్లా సోమేశ్వరరావు, పి.సాంబ శివరావు, ఎస్.పురుషోత్తమ, అరటకట్ల నారాయణమ్మ, జి.శేషారత్నం, దొర రత్నం, స్వరాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పాస్టర్ ఎజ్రా

యలమంచిలి: సామాజిక సేవా కార్యక్రమాల్లో అగాపే చారిటబుల్ ట్రస్ట్ పనితీరు అమోఘమని పాస్టర్ ఎజ్రా అన్నారు. బూరుగుపల్లి గ్రామంలోని ఏసుక్రీస్తు ప్రార్థన మందిరంలో అగాపే చారిటబుల్ ట్రస్ట్ 2025 నూతన క్యాలండర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పమ్మి లాజరు, మానుకొండ చిన్నయ్య, పమ్మి లీలమ్మ, రిబ్కా, తదితరులు పాల్గొన్నారు.

### తండ్రిపై కూతురు ఫిర్యాదు

నరసాపురం రూరల్: తండ్రిపై కూతురు ఫిర్యాదు చేసిన సంఘటన నరసాపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిట్టవరం గ్రామంలో చోటు చేసుకుంది. తన తండ్రి ఇంటిని కూల్చి వేయడంతో తన చదువుకు సంబంధించిన సర్టిఫికెట్లు, ఇంటిలోని సామాగ్రి మొత్తం పాడై పోయాయని చిట్టవరం గ్రామానికి చెందిన కోళ్ల ప్రజ్ఞాసౌమ్య ఫిర్యాదు చేసింది. ఇలా ఎందుకు చేశావని తండ్రి రాంబాబును నిలదీసినప్పటికీ సమాధానం చెప్పకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొంది. ఏఎస్సై శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.